# నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

3 | నిజామాబాద్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | NIZAMABAD





క్రీడాజ్యోతితో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## ఆరోగ్య సమాజం క్రీడలతోనే సాధ్యం

- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, సెప్టెంబర్ 26: ఆరోగ్యమైన సమాజం కేవలం క్రీడలతోనే సాధ్యమని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలు ఆడితే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించడం అలవడుతుందని, తద్వారా జీవితంలో ఎదురయ్యే ఆటోపోట్లను తట్టుకునే శక్తి లభిస్తుందని చెప్పారు. కమ్మర్‌పల్లి మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ మండల అంతర పాఠశాలల క్రీడలను వేముల గురువారం ప్రారంభించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాపోటీల నిర్వహణను సామాజిక బాధ్యతగా చూడాలని చెప్పారు. క్రీడల నిర్వహణ దైవకార్యం లాంటిదని, ఇందుకు డబ్బు, ఇతర రూపకంగా సహకారం అందించాలని ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోటీ ప్రపంచంలో ఆటలను మరచిపోయే పరిస్థితులు ఏర్పడవద్దనే ఆలోచనతో ప్రతిఒక్కరూ క్రీడలకు సహకరించాలని కోరారు. క్రీడలు కెరీర్ డెవలప్‌మెంట్‌కు కూడా ఉపయోగపడుతాయని, క్రీడాకారులు ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని వివరించారు. స్పోర్ట్స్‌కు పెట్టింది పేరు కమ్మర్‌పల్లి అని, గతంలో ఎక్కడ నిర్వహించనన్ని టోర్నీలు కమ్మర్‌పల్లిలో నిర్వహించే వారని అదే విధానాన్ని కొనసాగించాలన్నారు. తాను మంత్రిగా ఉన్నపుడు కమ్మర్‌పల్లిలో మినీ స్టేడియం నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరు చేయించానని, ఇప్పుడు అదే స్టేడియంలో పోటీలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తన వియ్యంకుడు, వ్యాపారవేత్త దయానందరెడ్డి దాతృత్వానికి అవధులు లేవని, అనేక పాఠశాలలకు డెస్క్ బెంచీలు, కంప్యూటర్లు, స్పోర్ట్స్ మెటీరియల్స్ ఇస్తున్నారని తెలిపారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, క్రీడల కన్వీనర్ సాయన్న, ఎంఈవో ఆంధ్రయ్య, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆధునిక పోకడలు..

నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆధునిక పోకడలు పెరిగి పోయాయి. అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. వాటిని నిర్మూలించడం పోలీసులకు పెను సవాల్‌గా మారింది. హోటళ్లు, లాడ్జీలు, ఫాంహౌస్‌లు, నగర శివారు ప్రాంతాల్లోని కొన్ని అడ్డాలు అక్రమ వ్యవహారాలకు చిరునామాగా మారాయి. మెట్రోపాలిటన్ నగరాలకే పరిమితమైన ఆధునిక విష సంస్కృతి ఇక్కడకూ విస్తరించింది. దావత్‌లు, కిట్టీ పార్టీల పేరిట విందులు, చిందులు, మరెన్నో అకృత్యాలు కొనసాగుతున్నాయి. డీజేలు పెట్టుకుని డ్యాన్సులు చేయడం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించడం నిత్యకృత్యమైంది. రేవ్ పార్టీల స్థాయిలో కాకపోయినా ఆ తరహాలో జిల్లాలో పార్టీలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి మహిళలను తీసుకొచ్చి డ్యాన్సులతో పాటు వ్యభిచారం చేయించిన ఉదంతం.. జిల్లాలో పెరిగిపోతున్న విచ్చలవిడితనానికి నిదర్శనంగా మారింది.





# ఈ నగరానికి ఏమైంది?

- విచ్చలవిడిగా వ్యాపిస్తున్న విష సంస్కృతి
- బెట్టింగ్, గంజాయి, పేకాట, వ్యభిచారం..
- అంతులేని అసాంఘిక కార్యకలాపాలు..
- ఇందూరు వేదికగా హైటెక్ సోకులు
- ఫాంహౌస్‌లలో విందులు, చిందులు, మరెన్నో..
- చర్చనీయాంశంగా మారిన పేకాటరాణుల పట్టివేత

నిజామాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్‌లో విష సంస్కృతి రెక్కలు విప్పుకుంటున్నది. మెట్రో సిటీస్‌కే పరిమితమైన నయా కల్చర్ ఇప్పుడు ఇందూరుకూ విస్తరించింది. బెట్టింగ్, పేకాట, హైటెక్ వ్యభిచారం, గంజాయి.. ఇలా అన్ని అసాంఘిక కార్యక్రమాలకు నగరం అడ్డాగా మారింది. జిల్లాలో డ్రగ్స్ వినియోగం లేదని అధికారులు చెబుతున్నా, అంతర్గతంగా ఆ దరిద్రం కూడా వేళ్లూనుకుంది. హైటెక్ వ్యభిచారం, బెట్టింగ్ జూదం తరచూ బయట పడుతూనే ఉంది. హోటళ్లు, ఫాం హౌస్‌లు, నివాసాలు, చివరకు దవాఖానాలు సైతం అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇటీవలే నగర శివారులోని ఓ స్టార్ హోటల్‌లో పేకాట, హైటెక్ వ్యభిచారం వెలుగులోకి వచ్చిన ఘటన మరువక ముందే, తాజాగా ఓ ప్రైవేట్ దవాఖానలో పేకాడుతూ మహిళలు పట్టుబడడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వేగంగా విస్తరిస్తున్న విష సంస్కృతిపై రోజంతా చర్చ జరిగింది.

అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం పోలీసులకు సవాల్‌గా మారింది. నిత్యం ఎక్కడో ఓ చోట పేకాటరాయుళ్లు పట్టుబడుతున్నారు. తరచూ వ్యభిచార ముఠాల ఆగడాలు బయట పడుతూనే ఉన్నాయి. గంజాయి విక్రయాలకైతే అడ్డే లేకుండా పోయింది. హోటళ్లు, లాడ్జీలే కేంద్రంగా బెట్టింగ్ వ్యవహారాలు నడుస్తున్నాయి. గుట్టుగా సాగుతున్న చీకటి దందాలపై పోలీసులు నిఘా పెడుతున్నా చాప కింద నీరులా పాకుతూనే ఉంది. ఓ చోట దాడి చేస్తే మరో చోట స్థావరాలు వెలుగు చూస్తున్నాయి. పోలీసు దాడుల నుంచి తప్పించుకునేందుకు పూటకో అడ్డా మారుస్తున్నారు. గతంలో నిఘా విస్తృతంగా ఉన్న సమయంలో కొందరు ఓమ్ని వంటి వాహనాల్లో తిరుగుతూ పేకాట ఆడిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఇప్పుడు శివారు ప్రాంతాలు పత్తాలాటకు అడ్డాలుగా మారాయి. కొత్త, పాత హోటళ్లు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా అక్రమాలు జరుగుతున్నాయి. పోలీసుల నిబంధనలకు అనుగుణంగా గదుల బుకింగ్ జరగడం లేదు. ఆధార్ కార్డు ప్రూఫ్ లేకుండానే ఇష్టానుసారంగా గదులను ఇచ్చేస్తున్నారు. ఒక్కో గదిలో 10-20 మందితో పేకాట ఆడిస్తున్నారు. ఇదే అదనుగా మగరాయుళ్ల కోరికలను తీర్చేందుకు వ్యభిచారం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి హైటెక్ వ్యభిచారం చేయిస్తున్న వైనం ఈ మధ్యే వెలుగు చూడటం కలకలం రేపింది.

### అడ్డే లేకుండా..

### ఫాంహౌస్‌లపై నిఘా ఏది?

సంపాదన పెరిగి పోవడంతో విపరీత అలవాట్లు వెంటాడుతున్నాయి. సకల సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఫాం హౌస్ సంస్కృతి పెరిగింది. సేదతీరేందుకు నిర్మించుకున్న కొన్ని వ్యవసాయ క్షేత్రాలు ఇతరాత్రా కార్యకలాపాలకు వేదికలుగా మారాయి. విచ్చలవిడిగా డబ్బులు సంపాదిస్తున్న వారంతా నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లో, అలాగే, 44వ జాతీయ రహదారికి కూత వేటు దూరంలో రూ.కోట్లు పెట్టి కొనుగోలు చేసిన భూముల్లో స్విమ్మింగ్ పూల్ సౌకర్యాలతో విలాసవంతమైన ఫాం హౌస్‌లు నిర్మించుకున్నారు. ప్రైవేట్ ఫాం హౌస్‌లు కావడంతో అందులో ఏం జరుగుతుందనేది పోలీసులకు తెలియడం లేదు. మరోవైపు, స్థానికంగా జరిగే అక్రమాలకు అక్కడి పోలీసుల సహకారం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. పేకాట స్థావరాలపై జరుగుతున్న దాడులన్నీ టాస్క్‌ఫోర్స్ పోలీసులవే కావడం ఇందుకు బలం చేకూర్చుతున్నది.





శ్రీరాంసాగర్ నుంచి దిగువకు వెళ్తున్న మిగులు జలాలు

## ఉప్పొంగిన మంజీర, గోదావరి

- ఎస్సారెస్పీకి పెరిగిన వరద
- 22 గేట్లు ఎత్తి నీటి విడుదల

మోర్తాడ్/ రెంజల్ / బోధన్ రూరల్, సెప్టెంబర్ 26: మంజీర, గోదావరి నదులు ఉప్పొంగాయి. మహారాష్ట్ర, కర్ణాటకలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తడంతో మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో మంజీరా నిండుగా ప్రవహిస్తున్నది. దీంతో బోధన్ మండలం సాలూర వద్ద నది పరవళ్లు తొక్కుతున్నది. కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం వద్ద హరిద్రా, మంజీరా నుంచి వస్తున్న వరదతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. నదిలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది. ఈ వరద శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చేరుతుండడంతో నీటికి దిగువకు వదులుతున్నారు. గురువారం 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 22 గేట్లను ఎత్తి మిగులు జలాలను దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టం (1091 అడుగులు/80.5 టీఎంసీలు)తో తొణికిసలాడుతున్నది.



కందకుర్తి వంతెన వద్ద గోదావరి ప్రవాహం


